# అంధత్వం వెనక



పురజాడు శోభ

‘‘ఇదేమిటమ్మా! కొత్తచీర కట్టుకోకుండా కూర్చున్నావు? జనిత గొంతు విని ఉలిక్కిపడింది శారద.

“అయ్యయ్యో జుట్టు చిక్కు కూడా తీసుకోలేదా? నేను తీస్తానుండు” అంటూనే చిక్కుతీయసాగింది జనిత.

"అమ్మా! ఇవాళ దీపావళి కదా, వీధులు ఎంత కళకళలాడుతున్నాయో తెలుసా? చిందులేసే చీకటి చెప్పాపెట్టకుండా ఎటు పారిపోయిందో ఏమో, ఎంత వెతికినా కనిపించటమేలేదు. రకరకాల రంగుల బల్బులు గుమ్మాల మీద కట్టబడి తోరణాల్లా మెరిసిపోతున్నాయి. గాలిని చూసి ప్రమిదలు ఎందుకనో ఒణికిపోతున్నాయి. భూచక్రాలు కప్పల్లా గెంతుతున్నాయి. చిచ్చుబుడ్లు చిందులేసే చిలిపి పిల్లల్లా ఉన్నాయి. "శారద చీకటి కన్నుల ముందు వెలుతురు తెరకట్టి, తెరమీదికి ఎన్నెన్నో టపాకాయలు రప్పించాలని ప్రయత్నిస్తోంది జనిత.

శారదకి ఈ దీపావళి ఏ మాత్రమూ కొత్తకాదు. ఆమె తన జీవితంలో ఎన్నో దీపావళులు చూసింది. కానీ గత కొన్నేళ్ళుగా ఆమె గుడ్డిదైపోయింది.

చక్కగా సిగచుట్టి, సిగచుట్టూ పూవుల నలంకరించి ంది జనిత. "అమ్మా! నువ్వు ఎంత బాగున్నావో తెలుసా? నాన్నగారు అందుకనే నిన్ను ఏరికోరి చేసుకొన్నారు అదేమి దురదృష్టమోకానీ నాకు నీ పోలికలే లేవుకదా" నవ్వుతూ అంది జనిత.

"అమ్మా నాన్నగారు వస్తున్నారు" చిన్నపిల్లలా అంది జనిత.

"ప్రొద్దున్నే వద్దామనుకున్నానా, పను ఞ పూర్తిచేసుకుని ఏదో బస్సు ఎక్కి వచ్చేటప్పటికి ఇంతసేపయింది, వెధవ ట్రాన్స్‌ఫర్లు మనుష్యులని దూరం చేసి పారేస్తున్నాయి. పోనీ ఆ ట్రాన్స్‌ఫర్ ఏ మంచి ఊర్లో కాకుడదూ? మాచ్‌కండ్ లాంటి ప్రదేశంలో నేను క్యాంపులకి వెళ్తే మీరు ఒంటరిగా ఉండాలే అని ఆలోచించామే కాని ఎంత ఎడబాటు అనుభవిస్తున్నామో!" రామారావు గొంతులో బాధ ధ్వనిస్తోంది.

"ఇదిగో జనితా స్వీట్లు తెచ్చాను. మనం చేసుకున్న పాపమేమిటో కాని ఒక్కగానొక్క పిల్లాడు తురకదానితో లేచిపోయాడు. నువ్వు సరేసరి. గుడ్డిదానివై పోయావు". రామారావు మాటల్లో తన అసమర్ధత కూడా కారణంగా ఉందేమో అన్న వేదన కనిపిస్తోంది.

"పోనీలెండి నాన్నగారు! ఇప్పుడు అవన్నీ ఎందుకు? అమ్మా నేను బాంబు కాల్చబోతున్నా మామూలుది కాదు. లక్ష్మీ ఆటంబాంబు" చిన్నపిల్లలా అంది జనిత.

"శారదా ఎప్పుడూ తాను అదృష్టవంతురాలే" అనుకుంటుంది గుడ్డిదని చూడక పిచ్చిగా ప్రేమించే భర్తని తలచుకుంటూ!

"శారూ నిద్రపోతున్నావా!'' టపాకాయల సందడి సద్దుమణిగే సమయానికి భార్య దగ్గరికి వచ్చి అడిగాడు రామారావు.

"లేదండీ" లేచికూర్చుంటూ అంది శారద. "నువ్వు నేను చెప్పినట్లు విని తీరాలి శారదా! నీకు త్వరలో కళ్ళ ఆప

రేషను చేయించాలని నా ఉద్దేశ్యం అమెరికానుండి "ఐ స్పెషలిస్టు" వస్తున్నాడు మన ఊరికి ఈ అవకాశాన్ని జారవిడుచుకునేటంత అవివేకిని కాదలచుకోలేదు."

"నాకు కళ్ళు లేకపోతే ఏమండీ! మీ కళ్ళతో చూడగలుగుతున్నా కదా" మనస్ఫూర్తిగా అంది శారద

"నేను నీ మాటలేవీ వినదలచుకో లేదు మధ్యలో పోయిన చూపు తొందరగా వచ్చే అవకాశం ఉందని ఎందరు చెప్పలేదు? ఇది సినిమాకాదు. అలాంటప్పుడు నా కళ్ళతో చూస్తున్నా అనడం సిల్లీగా లేదూ!" జవాబుకు ఆశించకుండా గది బయటికి వెళ్ళిపోయాడు రామారావు.

శారద మంచం దిగి అలవాటయిన గదే కాబట్టి తడుముకోక కిటికీ దగ్గరికి వెళ్ళి నిలబడింది. "నిజంగా నీకు ఈ సుందరమైన ప్రపంచాన్ని చూడాలని లేదా'" మనసు సూటిగా అడిగింది.

అసలు శారదకి చిన్నప్పటినుండీ బస్సెక్కినా, రైలెక్కినా కిటికీ దగ్గర కూర్చోడమే అలవాటు అంతదాకా ఎందుకు?

పెళ్ళయి' అత్తగారింట్లో అడుగు పెట్టాక "ఇది నీ గది" అని భర్త చూపిన గది ఆమెకి ఏ మాత్రమూ నచ్చలేదు. మామగారి గదే బాగా నచ్చింది. ఆయన గదిలో పెద్దపెద్ద కిటికీలు ఉంటాయి. ఆ కిటికీలకి గాజు తలుపులు ఉంటాయి. అవి కనక తెరిస్తే ఎవరో తరుముకు వస్తున్నట్లు దాక్కోడానికి కాస్త స్థలం దొరికితే చాలన్నట్లు లోనికి దూరే దొంగలా చల్లగాలి వస్తుంది. చిరుచీకట్లు నలుపక్కలకి క్రమ్మే సమయంలో పావురాళ్ళ గుంపు పూవుల దండలా పైన ఆకాశంలో ఎగురుతూ ఉంటే చూడడం ఆమెకి ఎంతో ఇష్టం.

ఆ గదిలోని 'వెంటిలేటర్'లో మగపిచుక గూడు కట్టడానికి పడ్డ శ్రమని కళ్ళారా చూసేది ఆడ పిచుక వెచ్చగా గూట్లోకూర్చుని తన బుల్లిపాప నోటికి ఆహారము అందించేది. మగ పిచుక కిచకిచ మనేది బహుశా "చాకిరి అంతా నాది" అని గొణుగుతుందేమో అనుకునేది అలాగే చూస్తూ.

తీయగా పాడే కోయిల పాట వినడంకన్న, దానికి దగ్గరగా నిలబడి అది నోరు కదిలిస్తూ పాడే తీరు చూడడం ఇష్టం.

మా ట్లా డే వా రి ముఖకవళికలలోని తేడాని గమనించడం ఇష్టం. చిన్నప్పుడు అక్క, తమ్ముడు టపాకాయలు కాలుస్తూ ఉంటే తననికూడా వాళ్ళకే ఇచ్చేసేది శారద. ఆమెకి కాల్చడంకన్న కాలుతుంటే చూడడం ఇష్టం. ఈ స్వభావం చాలా మందికి చిత్రంగా తోచినా పెద్దగా పట్టించుకునేది కాదు. తన కళ్ళు

ఎంత పుణ్యం చేసుకున్నాయో ఈ వింత సృష్టిని చూడడానికి అనుకునేదే కానీ, తను గుడ్డిదవుతుందని ఊహించగలిగిందా? కళ్లుపోయాకమాత్రం, తానింక ఒక్కరోజు కూడా బ్రతుకలేదు అనుకుందేకాని ఇన్ని ఏళ్ళు దొర్లించగలదనుకుందా?

ఇప్పుడు మళ్ళీ తనికి కళ్ళొస్తే నవ్వే పూవులతోపాటు హాయిగా నవ్వుతుంది వెన్నెలను తనివితీరా తన కళ్ళతో తాగేస్తుంది, ఆ ఆలోచనకే ఆమె మనసు పులకరించింది.

అసలు ప్రతి వ్యక్తి జీవితంలోనూ కళ్ళకి మించిన పెన్నిధి ఇంకోటి ఉంటుందా? గ్రుడ్డి బ్రతుకు బ్రతికేకంటే, గానుగ మరలోని ఎద్దు బ్రతుకే మెరుగేమో! తన గుడ్డితనాన్ని విపరీతంగా అసహ్యించుకుంది శారద.

ఇల్లు దాటి బయటకు అడుగుపెట్టడానికి లేదు. కిటికీ ఊచలకి ఆనించి ఉన్న తలని అసహనంగా విదిలించింది శారద

"డాక్టరు నీకు చూపు రప్పిస్తాడే పిచ్చిదానా? నీకు చూపు లేకపోయినా నిన్ను ప్రేమగా చూసుకునే భర్త ఇంకా అపురూపంగా చూసుకుంటాడే" ఓదార్చింది మనసు.

కానీ.... కానీ.... తన కళ్ళువస్తాయి అనుకుంటూ కట్టుకుంటున్న ఆశలగూడు, విధి ఆడిన నాటకాన ఓడి కూలితే? ఈసారి కూడా మనసు ఆమెని ఓదార్చింది. మానవ ప్రయత్నం చేయకుండా ఆలోచించవద్దని.


ఆనందంగా వెనుతిరిగి నడిచింది శారద. ఉత్సాహంగా ముందుకు పోతున్న పాదానికి ఏదో బలంగా తగిలింది. అది ఏమిటో తెలుసుకో లేకపోలేదు శారద. ఆమె గాజుగ్లాసును తన్నింది. "సరేలే బయటికి వెళ్ళి జనితకి చెప్తేసరి" అనుకుంటూ రెండడుగులు వేసిందో లేదో అబ్బా అని జీరగా అంటూ కూలబడిపోయింది, ఆ మూలే గాజు పెంకులు పడి ఉంటాయిఅనుకుందే కానీ అవి ఇటుకూడా పడ్డాయిఅని తెలిసిఉంటే కదిలేది కాదేమో అనుకుంది. బాధని ఓర్చుకుంటూ! చేతితో పాదాన్ని తడిమిచూసింది. ఏదో ద్రవం చేతుల్లోంచి వెచ్చగా కిందకి జారుతోంది. ఆ ద్రవాన్ని రక్తంగా పోల్చుకోలేని వెర్రిది కాదు శారద.

"అయ్యయ్యో! ఇంత రక్తం పోతోందేమిటమ్మా! గాభరాగా అంటూ డాక్టర్ని పిలవడం వగైరాలని చేయడంలోపడింది జనిత.

ఈ సంఘటన జరిగాక, తనకి కళ్ళు వచ్చి తీరాలి అనుకుంది శారద.

* * *

"చూడండీ! మీభర్త మీకోసం ఎంతో ఖర్చుతో ఆపరేషను చేయించారు. డాక్టరు ఫారినర్ కావడంతో ఫీజుకూడా ఎక్కువ ఇచ్చారు. ఆయన మీమీద ఉన్న ప్రేమాభి




మానాలకి మెచ్చి అయినా, దేవుడు కళ్ళు ఇవ్వాలి." కట్టు విప్పుతూ అంది నర్సు.

ముందు ఎవరిని చూస్తారు? అంది నర్సు. "వారిని.... మా వారిని చూస్తాను" అంది శారద.

కళ్ళుతెరిచినా చికిలించింది. చుట్టూ అరసెకన్ సేపు గాఢాంధకారం తారట్లా డింది. అంతలోనే చిన్నగా వెలుగు కిరణాలు కనిపించ సాగాయి. మసక మసకగా ఏదో ఆకారం కనిపిస్తోంది. ఆ ఆకారం భర్తదే అని తెలుసుకో డానికి పావుగంట పట్టింది.

"ఏమండీ నాకు కనిపిస్తోందండీ నాకు కనిపిస్తోందండీ" దగ్గరే ఉన్న భర్తని చుట్టేస్తూ చిన్నపిల్లలా అంది శారద. ఆమె కన్నుల్లో నీరు తిరిగే ప్రయత్నంలో పడింది.

"అదిగో ఏడుస్తున్నారు. భారతదేశ వనితలకి ఇదో ఆయుధం. మీరు ఇలాం టప్పుడు ఎగ్జైట్ అయితే ప్రమాదం" సున్నితంగా అంగ్లలో హెచ్చరిస్తున్న డాక్టర్ కాళ్ళకి నమస్కరించకుండా ఉండ లేకపోయింది.

నర్సువైపు వాత్సల్యంగా చూస్తూ తన ఉంగరాన్ని ఇచ్చింది.

అప్పటికి ఆమెచూపు జనితమీద పడింది. జనితని దగ్గరగా తీసుకుంటూ కిటికీలోంచి బయటకి చూసింది. సూర్య కిరణాలు సూటిగా భూమ్మీద పడుతు న్నాయి. "భగవంతుడా! విన్నుచూస్తే కాపీ అన్నం ముట్టేదాన్ని కాను ఒక ప్పుడు. ఇన్నేళ్ళు ఎలా తిన్నానో? నన్ను క్షమించు స్వామి" అని చేతులు జోడిం చింది, అతి భక్తిగా శారద.

శారదకి హాస్పిటల్ నుండి డిస్చార్జ్ అయ్యాక కిటికీ వదలబుద్ధి కావడంలేదు. చక్కగా అలంకరించుకుని, ఈ వయసులోకూడా ఇలాగే ఉన్న తన అందాన్ని చూసి గర్వపడింది. భర్తకి ఆ ఊరు నుండి ఇక్కడికే ట్రాన్స్ఫర్ కావడంతో ఏనుగు ఎక్కినంత ఆనందపడింది.

ఇల్లంత చిన్నబోయింది. ఎంతయినా ఆడపిల్లలు ఉన్న ఇల్లే ఇల్లు అనుకుంది శారద. ఆడపిల్లలు అనగానే జనిత గుర్తువచ్చి ఆమె శరీరం అసహ్యంతో దహించుకు పోయినట్లయింది.

ఆయన చెప్పిన మాటలువిని తాను ముందర నమ్మలేక పోయింది. తనని గుడ్డిదాన్నిచేసి ఇలా గొడవచేస్తుందా? ఎంతయినా అది తనకి పుట్టిన బిడ్డయితే తమ రక్తం దానిలో ప్రవహించడానికి? చెత్తకుండీ దగ్గర పసిగుడ్డు ఏడుస్తుందే అని ఇంట్లోకి తెచ్చినందుకు, ఎందుకో ఆ పిల్లని అనాధాశ్రమంలో చేర్పించ బుద్ధికాక ఇంట్లో పెట్టుకున్నందుకు తన తిక్క కుదిరింది.

"రంకు నేర్చినజాణ ఏమి ఎత్తుకు పోదామని పెట్టెలో దాచుకుందో చూడాలి" కుతూహలంగా అనుకుంటూ జనిత పెట్టె తెరిచింది.

"నాకున్న ఆప్తమిత్రులు ఈ నా డైరీలు" అని రాసిఉంది మొదటి పేజీలో!

"నేనెవ్వర్ని? ఏ కులందాన్ని? ఏ మతందాన్ని? నా మాతృభాష ఏది? ఇవేవీ చెత్తకుండీ దగ్గర పడేసిన మా అమ్మ చెప్పలేదు. కాని జాలితో నా బ్రతుక్కో మార్గం కలిగించింది మాఅమ్మ. ఇంకొంత సేపు అలా చెత్తకుండీ దగ్గరేఉండిఉంటే. ఊహించుకోలేక పోతున్నాను. నా పదవ ఏటనే శారదగారు వాళ్ళమ్మతో నా కారణంగా గొడవపడడం విన్నాను. నే నెవరినో తెలుసుకున్నాను." అన్నని నన్ను వేరుగా చూడ్డానికి కారణం ఇదే.

పది పాసవగానే "చాల్లే" అంది. అమ్మా "నాకు పెద్ద ఆసక్తిలేదు" అన్నాను నా ఆశలని అణచేస్తూ! "నాకు నా కాళ్ళమీద నిలబడాలని ఉంది. నన్ను చదివించండి" అని వేడుకోవాలని ఉన్నా ఆ పని చేయలేకపోయాను. నాకు ఏడుపు వస్తే, దిండు నా రుమాలుగా మారి కన్నీరు అద్దేది.

అమ్మ గుడ్డిదయిపోయింది. అన్న విషయం తెలుసుకుని చాలా బాధపడ్డాను. అప్పుడే తెలిసింది అమ్మంటే నాకు ఎంత ఇష్టమో! నాన్న వచ్చాడు. ఆయన నాన్న కాడు! నరరూప రాక్షసుడు. అమ్మని వదిలేస్తానన్నాడు "ఎందుకని అడిగితే" "గుడ్డిది నాకు ఒద్దు" అన్నాడు "ఇంక ప్రశ్నించే హక్కు నీకు లేదు" అన్నాడు

"అసలే తన లోపాన్ని చూసి కుమిలి పోయే అమ్మకి ఈ విషయం ఎలా చెప్పను? అందుకే విడాకుల గొడవ



తేకుండా గుళ్ళో పెళ్ళిచేసుకోమన్నాను. అప్పుడప్పుడు ఆవిడని ఊరడించమన్నాను. ఈ ఊర్లోనే వేరే ఇంట్లో ఉంటున్నా ట్రాన్స్‌ఫర్ అని చెప్పన్నాను." అయిష్టంగా చూస్తూ "ఏదో కొద్ది డబ్బివ్వగలనన్నాడు. "మా అమ్మని నేను పోషించగలనన్నాను." ఎలా? తల్లి ఋణం తీర్చడానికి నా అన్నది నా శీల మొక్కటే మిగిలింది. దాన్నే అమ్మకానికి పెట్టాను. డబ్బు కూడబెట్టి అపరేషన్ జరిపించాను. కళ్ళు వచ్చిన అమ్మని ఆయన ఏలుకుంటున్నాడు. నేను నిజాన్ని చెప్పేస్తానని ఆ కారణంగా ఇంట్లో నుండి వెళ్ళగొట్టాడు. "ఈ విషయం చెప్తే ప్రాణం పోతుంది" అన్నాడు. కల్మషమైన నా శరీరం నుండి ప్రాణంపోతే సంతోషమే నాకు. అయినా మనదేశ స్త్రీలు తమభర్త చెడ్డవాడని బ్రహ్మ వచ్చి చెప్పినా నమ్మరేమో.

చలనంలేని బొమ్మలా కూర్చున్న

శారదకి కన్నీళ్ళు కారిపోతున్నాయి. ఎన్ని కల్పించి చెప్పాడు అతను? అమ్మా! అన్న పిలుపు శారదని మేల్కొలిపింది. ఆ పిలుపు తన కళ్ళుపోయినా చూడ్డానికి రాని కొడుకుది కాదు. తనకోసం శీలాన్ని పణంగా పెట్టిన ఓ స్త్రీమూర్తిది. "అమ్మా నీ గొలుసు ఇచ్చి పోదామని వచ్చా నాముఖం చూడవద్దులే!" జవిత మాటలు శారదని ఇంకా ఏడ్చేలా చేసాయి.

"నీకు కళ్ళు లేవుకదా అని, నీ నగలన్నీ పెట్టుకునేది శారా! అన్న భర్త మాటలు ఆమె చెవిలో మారుమ్రోగుతున్నాయి "పరోపకారార్థమిదం శరీరం" అని భావించే ఓ పుణ్యచరితకి ఆమాటలు వర్తిస్తాయా? నాకు పెళ్ళిచేస్తావా చేసుకోమంటావా" అంది అని వర్ణించాడే కాని శరీరాన్ని అపవిత్రం చేసుకున్న ఆపిల్ల పెళ్ళిని గూర్చి ఆలోచించదని తెలుస్తూనేఉంది. ఈనాడు తన భర్త తన దగ్గరుంటూ క్యాంపుల వంకతో ఆవిడదగ్గరికి పోతున్నాడేమో! "అమ్మా చివరిసారి నీకాళ్ళకి దణ్ణంపెట్టి పోతాను." "నన్ను చూడవద్దులే కాళ్ళని ఇటుపెట్టు చాలు" అంది నెమ్మదిగా జవిత.

శారద పంటికింద పెదవి నలిగిపో సాగింది ఎవరు ఎవరికి మ్రొక్కాలి! శారదకి ఆక్షణంలో జవిత రూపం ఇంతకు అంత పెరిగి ఆకాశానికి ఎదిగినట్లనిపించింది. ఆమె ముఖం చూసే అర్హత తనకిలేదు.

"జవితా ఆగమ్మా! అక్కడే ఆగు ఒక్క క్షణం" అంటూనే ఇనపత్తెరతో రెండు కళ్ళూ పొడిచేసుకుని "ఇప్పుడు నాముందుకు రామ్మా. నా ముఖాన్ని నీకు చూపలేను. నీ శీలం వెచ్చించి తెచ్చిన నా ఈ కళ్ళతో నీ స్ఫటికల్లాంటి కళ్ళల్లోకి చూడలేను. నిన్ను పతితని చేసిన ఈకళ్ళు నాకు ఒద్దమ్మా" అంది బాధతో! ఆమెకాక్షణంలో తనకి కళ్ళంచే ఉన్న పిచ్చికాని, తన చూపుకోసం జవిత చేసిన కృషికాని గుర్తురాలేదు. ఎర్రటి రక్తం ముద్దల్లా చొచ్చుకు వచ్చిన కళ్ళని, కారుతున్న కన్నీళ్ళని, శారద ఒడిలోని డైరీని వెర్రిగా చూస్తూ అరిచేశక్తి లేనట్లుగా శిలలా నిలబడిపోయింది జవిత.

